
వారధిని వదిలేశారిలా..

విశాఖ– విజయనగరం జిల్లాల మధ్య వారధి.. గోస్తని నదిపై వంతెన. ఈ బ్రిడ్జిపై రెయిలింగ్ శిథిలం కావడంతో రెండుజిల్లాల మధ్య రాకపోకలు సాగించేవారు ప్రమాదపుటంచున ప్రయాణించాల్సి వస్తోంది. హుద్‌హుద్ తుపాను సమయంలో దెబ్బతిన్న వంతెనకు ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

ప్రమాదకరంగా గోస్తని నదిపై వంతెన

- హుద్‌హుద్ తుపానుకు శిథిలమైన రెయిలింగ్
- పదేళ్లు దాటినా చేపట్టని పునర్నిర్మాణం
- నిలిచిపోతున్న వర్షపునీరు
- విశాఖ- విజయనగరం జిల్లావాసుల అవస్థలు


గోస్తని నది వంతెనపై శిథిలమైన రెయిలింగ్

పద్మనాభం: పద్మనాభం గ్రామ సమీపంలోని గోస్తని నదిపై ఉన్న వంతెన ప్రమాదకరంగా తయారైంది. విశాఖపట్నం, విజయనగరం జిల్లాల ప్రజలకు వారధిగా 1989లో రూ.39లక్షలతో దీనిని నిర్మించారు. ఇన్నేళ్లలో ఒక్కసారి మాత్రమే మరమ్మతులు చేయగా, తర్వాత దీనిని పట్టించుకోలేదు.

రెండువైపులా రెయిలింగ్ లేక..

2014 అక్టోబర్‌లో సంభవించే హుద్‌హుద్ తుఫాన్‌కు వంతెనకు రెండు వైపులా రెయిలింగ్ దెబ్బతింది. ఉన్న కొద్దిప్రాంతంలోనూ రెయిలింగ్ శిథిలమై ఇనుప ఊచలు పైకి కనిపిస్తున్నాయి. అవి కూడా ఒక్కొక్కటి ఊడిపోతున్నాయి.

ఈ వంతెనపై విజయగనగరం, విశాఖపట్నం, సింహాచలం ప్రాంతాలకు బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, స్కూల్ బస్సులు నిరంతరం తిరుగుతూ ఉంటాయి. రెయిలింగ్ లేకపోవడం వల్ల వాహన చోదకులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా వాహనాలు గోస్తని నదిలోకి పల్టీకొడితే.. ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. గోస్తని నది అందాలను వంతెనపై నుంచి తిలకించే ప్రయత్నంలో విద్యార్థులు, పాదచారులు అదుపు తప్పి నదిలో పడిపోయే పరిస్థితి ఉంది. లారీలు, బస్సుల వంటి భారీ వాహనాలు వచ్చినప్పుడు ద్విచక్ర వాహన చోదకులు వంతెనపై పక్క నుంచి వెళ్లేటప్పుడు ఏ మాత్రం అశ్రద్ధగా ఉన్నా ఇక అంతే సంగతులు.


ఇనప జాలీలు లేని మ్యాన్‌హోల్స్


గోస్తని నది వంతెనపై నిలిచిపోయిన వర్షపు నీరు

మ్యాన్‌హోల్స్ ఉన్నా..

వర్షపు నీరు వంతెన పైనుంచి కిందకు పోయేందుకు మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేశారు. వీటిపై ఉండే ఇనుప జాలీలు ఊడిపోవడంతో ఇవి ప్రమాదకరంగా తయారయ్యాయి. మ్యాన్‌హోల్స్ ఉన్నా వర్షపునీరు కిందకు వెళ్లకుండా వంతెనపైనే ఉండిపోతోంది. దీంతో వాహనాలు రాకపోకలు సాగించినప్పుడు ఆటోలు, ద్విచక్రవాహనాలపై వెళ్లే ప్రయాణికులపై ఆ నీరు తుళ్లిపడి దుస్తులు పాడవుతున్నాయి. మ్యాన్‌హోల్స్‌పై ఇనప జాలీలు లేకపోవడంతో పద్మనాభంలోని పాఠశాలలకు నడిచే వెళ్లే మద్ది విద్యార్థులు, సాధారణ పాదచారుల కాళ్లు ఈ మ్యాన్ హోల్స్‌లో దూరిపోయే ప్రమాదముంది. వంతెనపై గోతులు కూడా ప్రమాదకరంగా ఉన్నాయి. వంతెన కిరుపక్కలా మట్టి పేరుకుపోయింది. వంతెనపై ఆర్‌డబ్ల్యూఎస్ పైపు లైను లీకవడంతో నీరు నిల్వ ఉండిపోతుంది. సుమారు నెల రోజుల నుంచి పైపు లైను లీకవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి వంతెనపై దృష్టిసారించాలని, సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రయాణమంటే భయం వేస్తోంది



రెయిలింగ్స్ లేక వంతెనపై ప్రయాణమంటే భయంగా ఉంటోంది. లారీలు, బస్సులు వస్తున్నప్పుడు ద్విచక్రవాహనాలపై వెళ్లేవాళ్లం చాలా జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తోంది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా నదిలో పడిపోవడమే. – ఎస్.నారాయణరావు, కృష్ణాపురం

అధికారులు స్పందించాలి



పదేళ్లగా వంతెన ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. వర్షపునీరు కిందకు వెళ్లక వాహనాలపై వెళ్తున్నవారిపై పడిపోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. రెయిలింగ్ ఏర్పాటుతో పాటు వంతెనపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి. – ఎస్.పైడినాయుడు, విజయరాంపురం

రూ.20 లక్షలతో ప్రతిపాదనలు

వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ మళ్లీ నిర్మించడానికి చర్యలు తీసుకుంటాం. వంతెనపై రెయిలింగ్‌తో పాటు ఇతర పనులు చేపట్టడానికి రూ.20లక్షలతో ప్రతిపాదనలు రూపొందించాం. మంజూరు కాగానే పనులు చేపడతాం. – గంగరాజు, డీఈఈ


ఇనుప ఊచలు పైకి కనిపిస్తున్న రెయిలింగ్

క్లుప్తంగా

సిరులతల్లికి తులసి అర్చన


తులసిదళాల నడుమ మొగదారమ్మ మహాలక్ష్మి అమ్మవారు

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్‌లోని శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం సహస్ర తులసి అర్చనను వైభవంగా నిర్వహించారు. ముందుగా వేకువ జామున అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన, దుర్గా హోమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాలల వికాసానికి ప్రాథమిక విద్య కీలకం


అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అంజలి గుప్తా బత్రా

కొమ్మాది: బాలల సమగ్ర వికాసానికి ప్రాథమిక విద్య ఎంతగానో దోహదపడుతుందని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ అలుమ్ని క్లబ్ (జాక్) జాతీయ చైర్ పర్సన్ అంజలి గుప్తా బత్రా అన్నారు. సాగర్‌నగర్ దరి ముసలయ్య పాలెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. జేసీఐ అలుమ్ని క్లబ్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించడం అభినందించదగిన విషయమని కొనియాడారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజ నిర్మాణానికి ఉపయోగపడతాయన్నారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో సీతా, లక్ష్మణ సమేత శ్రీరాముడు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు జీరుపేటలో సీతారామ సహిత లక్ష్మణస్వామి ఆలయ 10వ వార్షికోత్సవాలను శనివారం నిర్వహించారు. ఉదయం స్వామివారికి క్షీరాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో బైబో భజన నిర్వహించారు.

మద్దిలో వారపుసంత ప్రారంభం


సంతలో పశువులు

పద్మనాభం: మండలంలోని మద్దిలో శనివారం పశువుల వారపుసంత ప్రారంభమైంది. ప్రతీ శనివారం ఈ సంత నిర్వహించనున్నారు. నియోజకవర్గం పరిధిలోని ఆనందపురం, పద్మనాభం, భీమునిపట్నం మండలాల నుంచే కాకుండా విజయనగరం జిల్లా జామి మండలం అన్నంరాజుపేట నుంచి రైతులు తమ పశువులైన ఎద్దులు, ఆవులు, మేకలు, గొర్రెలు, కోళ్లు తీసుకువచ్చి క్రయవిక్రయాలు జరిపారు.

టిప్పర్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ

పీఎం పాలెం: జాతీయ రహదారిపై ఎండాడ వైపు స్కూటీపై వెళ్తున్న మహిళను అదే రోడ్డులో వస్తున్న టిప్పర్ లారీ ఢీ కొనడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన క్రికెట్ స్టేడియంకు ఎదురుగా శనివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో జరిగింది. గాయపడిన మహిళను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ లారీని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు

ప్రణాళికతో చదివితే ఉన్నత శిఖరాలు

- డీఈవో ప్రేమ్‌కుమార్
- జిల్లాలోని ఏడు బీసీ వసతిగృహ విద్యార్థులకు 'ప్రేరణ' సదస్సు


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు


మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

భీమునిపట్నం: విద్యార్థులందరూ శ్రద్ధతో చదివితే విజయం సొంతమవుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.ప్రేమ్‌కుమార్ అన్నారు. ప్రణాళికలను రూపొందించుకుని, అమలు చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. స్థానిక బీసీ సమీకృత వసతి గృహంలో జిల్లాలోని ఏడు బీసీ వసతిగృహాలకు చెందిన 200మంది పదో తరగతి విద్యార్థులకు శనివారం నిర్వహించిన ప్రేరణ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరి జీవితంలో పదో తరగతి కీలకమని, జాగ్రత్తగా చదివి మంచి మార్కులు పొందాలని సూచించారు. చాలామందికి పరీక్షలంటే ఆందోళన, భయం ఉంటాయని.. అటువంటివేమీ పెట్టుకోకుండా ధైర్యంగా పరీక్షలు రాస్తే చక్కని మార్కులు వస్తాయన్నారు. ఉపాధ్యాయులు చెప్పే సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా చదువుకోవాలని తెలిపారు. ఏమైనా సమస్యలుంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీదేవి, సహాయ సంక్షేమ అధికారి జ్యోతి, వార్డెన్లు సన్యాసినాయుడు, సుజాత, ధనరాజ్, శివకుమార్ పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే సత్ఫలితాలు


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఏపీసీ చంద్రశేఖర్

భీమునిపట్నం: ఒత్తిడి లేకుండా చదువుకుని పరీక్షలకు హాజరైతే మంచి ఫలితాలను పొందవచ్చని సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జె.చంద్రశేఖర్ అన్నారు. భీమిలిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని శనివారం సందర్శించి 8,9,10, ఇంటర్ విద్యార్థినులతో మాట్లాడారు. ముందుగా ఇక్కడ నిర్వహణ ఎలా ఉంది, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని విద్యార్థినులను ప్రశ్నించగా, అందరూ బాగుందని తెలిపారు. అనంతరం ఏపీసీ మాట్లాడుతూ ఇక్కడి బోధనను, సదుపాయాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సూచించారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అనంతరం విద్యాలయ పరిసరాలను, వంటశాలను పరిశీలించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

తగరపువలస: దేశంలో దళితులపై జరుగుతున్న దాడులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మాల మహానాడు ఆధ్వర్యంలో తాళ్లవలసలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. దళితులపై దాడులు అరికట్టాలంటూ నినాదాలు చేశారు. ఇటీవల న్యాయస్థానాలు కూడా దళితులకు వ్యతిరేకంగా తీర్పులు వెల్లడిస్తున్నాయని ఆరోపించారు. దేశంలో సాంకేతికాభివృద్ధి జరుగుతున్నా కులవివక్ష, దళితులపై దాడులు వెలుగు చూస్తున్నాయన్నారు. ఇటీవల మధ్యప్రదేశ్, తెలంగాణ, తమిళనాడులో దళితులపై జరిగిన దారుణాలను ఉదహరించారు. మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు బోని సన్నిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవస్థాపకుడు భాగం గోపాలరావు, ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మామిడి శివ, కొట్యాడ వీరకుమార్, సియ్యాద్రి రాంబాబు, బోని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేముడుబాబుకు చిన్న శ్రీను పరామర్శ


దేముడుబాబును పరామర్శిస్తున్న మజ్జి శ్రీనివాసరావు

పద్మనాభం: అనారోగ్యంతో బాధ పడుతున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, పాండ్రంగి కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ఆర్.ఎస్.దేముడు బాబును పార్టీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) శనివారం పరామర్శించారు. పాండ్రంగిలోని దేముడుబాబు ఇంటికి వెళ్లిన ఆయన దేముడుబాబు ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, భీమునిపట్నం ఎంపీపీ దంతులూరి వాసురాజు, పార్టీ పద్మనాభం మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, నాయకులు దాట్ల పెదబాబు, బుగత సత్యనారాయణ, అముజూరి అప్పారావు, సుంకర నారాయణరావు ఉన్నారు.

క్యాన్సర్ ఉచిత నిర్ధారణ పరీక్షలు నేడు

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీ దిబ్బపాలెంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్యాన్సర్‌పై అవగాహన, ఉచిత నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. ఒమేగా ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరంలో బ్రెస్ట్ స్క్రీనింగ్, పాప్‌స్మియర్, డాక్టర్ కన్సల్టేషన్, మధుమేహం, రక్తపోటు పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బోరుబావుల మరమ్మతులకు ప్రత్యేక డ్రైవ్


గొంపవానిపాలెంలో ప్రత్యేక డ్రైవ్ ప్రారంభిస్తున్న అధికారులు

తగరపువలస: వేసవిని దృష్టిలో పెట్టుకుని ఆనందపురం మండలంలో బోరుబావుల మరమ్మతులకు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు శనివారం ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించారు. ముచ్చర్ల పంచాయతీ గొంపవానిపాలెంలో ఈ కార్యక్రమాన్ని ఈఈ చౌదయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 26 గ్రామ పంచాయతీలలోని 113 గ్రామాలలో 850 బోరుబావులు ఉన్నట్టు తెలిపారు. ఎక్కడైనా బోరుబావులు పాడైతే, ఈ ప్రత్యేక డ్రైవ్‌ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈ ఈశ్వరీబాయి, ఏఈ మూర్తి, మెకానిక్‌లు సత్తిబాబు, రాజు, వెంకటరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం


వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి హరికిరణ్‌రెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు

తగరపువలస: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యపడుతుందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి అన్నారు. జీవీఎంసీ ఒకటోవార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, పందిరి విజయ్ ఆధ్వర్యంలో హరికిరణ్ రెడ్డిని శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ ప్రారంభం నుంచి బలోపేతానికి కృషి చేసిన హరికిరణ్‌రెడ్డికి పదవి రావడంపై హర్షం వ్యక్తం చేశారు. హరికిరణ్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో పార్టీ పూర్వ వైభవం దక్కించుకుంటుందన్నారు. కార్యక్రమంలో రెండో వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, ఉప్పాడ నాగేశ్వరరావు, అక్కరమాని గంగాధర్, చిల్ల బాబయ్యరెడ్డి, గంట్రేటి ఈశ్వరరావు, చింతగుంట శివ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

తగరపువలస: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసనాయుడు తరపున మిత్ర సంఘాలు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ నెల 27న జరగనున్న ఎన్నికలలో ఆయనను గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రచారంలో గోపీనాథ్, ఇమంది పైడిరాజు, అల్లి రామకృష్ణ, రెడ్డిపల్లి అప్పలరాజు, ఎస్.కృష్ణారావు, కరుణాకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతోనే విభిన్న ఆవిష్కరణలు


ప్రదర్శనను తిలకిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

తగరపువలస: నిరంతరం కొత్త ఆలోచనలతో విద్యార్థులు ముందుకు సాగేలా విద్యాసంస్థలు ప్రోత్సహించాలని డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. వినూత్న ఆలోచనలే విభిన్న ఆవిష్కరణలకు నాంది పలుకుతాయన్నారు. భీమిలి కేథరిన్ విద్యాసంస్థల్లో రెండు రోజుల పాటు జరుగనున్న స్టెమ్స్ ఫెయిర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు నవకల్పనలపై దృష్టి సారించాలన్నారు. కేథరిన్ విద్యాసంస్థల చైర్మన్ ఆలీవర్ ఆర్ రాయి మాట్లాడుతూ స్టెమ్స్ ఫెయిర్‌కు ఆదివారం చుట్టుపక్కల ప్రాంతాల తల్లిదండ్రులకు ఆహ్వానం పలుకుతూ ఉచిత రవాణా ఏర్పాట్లు కల్పించామన్నారు. డీఈవో మోడల్స్ పరిశీలించి, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కేథరిన్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ఆచార్య రతన్‌రాజు, డైరెక్టర్ ఇవాంజిలిన్ రాయి తదితరులు పాల్గొన్నారు.

డీఈవో ఆకస్మిక తనిఖీ


పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేటలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను డీఈవో ఎస్.ప్రేమ్ కుమార్ శనివారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆహారం విషయంలో నాణ్యత పాటించాలని సూచించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల అభ్యసన సామర్థ్యం అడిగి తెలుసుకున్నారు. మార్చి 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు ఏ మేరకు సిద్ధమయ్యారో ఆరా తీశారు. శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

పీఎం పాలెం: స్థానిక తులసీనగర్ ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ పార్కు గాదె రోశిరెడ్డి కళావేదిక వద్ద ఆదివారం ఉదయం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చందక విశ్వేశ్వరరావు తెలిపారు. ఆరోజు ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే శిబిరంలో బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


కింతల గోవిందరాజు (ఫైల్)

కొమ్మాది: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డారు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి.. కింతల గోవిందరాజు (55) భార్య లక్ష్మి, కుమారులు జయరాం, జీవన్ రాజ్‌తో కలసి కాపులుప్పాడ జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నారు. ఉదయం టీవీఎస్ ఎక్సెల్‌పై ఇంటింటికీ తిరుగుతూ స్క్రాప్ సామగ్రి కొంటూ, మధ్యాహ్నం అదే వాహనంపై బీచ్ రోడ్డులో ఐస్ క్రీం అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో శనివారం రాత్రి 9 గంటల సమయంలో కాపులుప్పాడ వుడా లేఅవుట్‌లో ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. భీమిలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్‌కు పొగ


వేములవలస ఫ్లై ఓవర్ కింద చెత్తకు నిప్పు పెట్టడంతో మార్కెట్‌లోకి వెళ్తున్న పొగ

తగరపువలస: ఉత్తరాంధ్రలోనే పెద్దదైన వేములవలస మార్కెట్‌లో వసతులు మాత్రం కనిపించడం లేదు. నిత్యం అర్ధరాత్రి దాటిన తరువాత ప్రారంభమైన లావాదేవీలు ఉదయం 10 గంటల వరకు గట్టిగా సాగుతాయి. ఈ సందర్భంగా మిగిలిపోయిన కూరగాయలు, ఆకుకూరల వ్యర్థాలు, సంచులు, తట్టలను వ్యాపారులు అక్కడే వదిలేసి వెళ్లిపోతారు. వీటిని పారిశుధ్య సిబ్బందితో తరలించవలసిన గ్రామ పంచాయతీ నిప్పు పెట్టి పొగను వ్యాపారులు, రహదారిపై రాకపోకలు సాగించేవారిపై వదిలి పెడుతోందని వాపోతున్నారు. ఆదాయం పంచాయతీకి, పొగ మాకా అంటూ మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గొప్ప కార్యానికి గట్టి సంకల్పం అవసరం


ప్రవచనం వినిపిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: గొప్ప కార్యం సాధించడానికి గొప్ప సంకల్పం అవసరమని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. అటువంటి సంకల్పం చేసిన హనుమ బుద్ధిబలం, వేగం చేత మహాసముద్రాన్ని దాటిన వైనం పరమ అద్భుతమని కొనియాడారు. మధురవాడ గాయత్రి విద్యా పరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల వద్ద సంపూర్ణ రామాయణంపై జరుగుతున్న ప్రవచనాల్లో భాగంగా శనివారం సుందరకాండపై ప్రవచనం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీరామాయణంలో సుందరకాండ పరమ ఉత్కృష్టమైందని పేర్కొన్నారు. దీనినుంచి సంస్కార వైభవం నేర్చుకోవాలన్నారు. హనుమ సముద్రాన్ని దాటడానికి ముందు సూర్య భగవానుడు,దేవేంద్రుడు, వాయుదేవుడు, బ్రహ్మతోపాటు సకల దేవతలకు నమస్కరించి సహకరించాలని కోరారని తెలిపారు. హనుమ సంకల్పించిన గొప్ప కార్యానికి ఏ ఆటంకాలు వచ్చినా వాటన్నింటినీ అధిగమించి, కార్యాన్ని నెరవేర్చి సఫలీకృతమైన అంశంతో పాటు పలు ఘట్టాలను వివరించారు.